నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326
సంపుటి : -13 సంచిక : 62 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
23-12-2025 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4


# నియోజకవర్గంలో విసుగెత్తిపోతున్న కార్యకర్తలు

- అపూర్వ విజయం సాధించినప్పటికీ కార్యకర్తలకేది గుర్తింపు
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు జేజేలు..గెలిచాక...?

**నవతరం శ్రీకాకుళం**

తెలుగు దేశం పార్టీ జనసేన బీజేపీలతో జతకట్టి ఎన్నికల్లో వెల్లగా, ప్రజలు టీడీపీ ఆదరించి,అధికారాన్ని కట్టబెట్టారు. అయితే అపూర్వ విజయం స్వంతం చేసుకున్న తెలుగుదేశంపార్టీ కూటమి ప్రభుత్వంగా కొనసాగుతున్న వేళ కార్యకర్తలకు గెలుపు మంచి ఉత్తేజాన్ని ఇచ్చినప్పటికీ అనంతర పరిణామాలు వలన శ్రీకాకుళం నియోజకవర్గంలో కార్యకర్తలు డీలాపడిపోయారు. సగానిపైగా కార్యకర్తలు ఎవరూ ఎమ్మెల్యే కార్యక్రమాలకు రావడం లేదు. వచ్చిన వారిపేర్లను మీడియా వారు తెలిస్తే వేసుకోవడం తప్పా.. కార్యక్రమ నిర్వాహకులు మాత్రం పేర్లు ఎవరికి పెట్టడం లేదు. ఎందుకిలా అడిగితే ఒకరా ఇద్దరా అందరి పేర్లు ఎందుకంటూ ప్రశ్నించినట్లు బోగట్టా.

ఇదిలా ఉండగా గతంలో ఎమ్మెల్యే ఉన్న గుండలక్ష్మీ దేవి హాయాంలో అందరిని ఆదిరించి అందరి మనిషిగా నిలిచారు.. ఇంకా చెప్పాలంటే నియోజకవర్గంలో రెండు వర్గాలుగా మారి ఒక వర్గాన్ని అణిచివేసే పనిలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పదవులు వరించినా ఆ పదవులను దక్కనీయకుండా శ్రీకాకుళం నియోజకవర్గంలో జరుగుతోందని వాపోతున్నారు. తాము టీడీపీలో ఉన్న వ్యక్తులమే అని అయితే తమకు పదవి వస్తే సంతోషం వ్యక్తం చేయాల్సింది పోయి పదవులు రాకుండా అడ్డుపడుతున్నట్లు కార్యకర్తలు గగ్గోలు పెడుతున్నారు. తాము ఎన్నికల వేళ ఎంతో కష్టపడి పనిచేస్తే తమకు ఇదే ఫలితమా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కేంద్ర మంత్రి పరిస్థితిని పరిశీలిస్తే ఆయన కార్యకర్తలెవరికి చిక్కడం లేదని, శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న రోజుల్లో కనీసం కలుద్దామని వెలితే అక్కడ ఉన్న నాలుగైదుగురు వీరులు ఆయనను కలవనీయకుండా అడ్డుపడుతున్నట్లు సమాచారం. ఎవరైనా క్యూ ఫాలో అవ్వాలని చెబుతున్నారట, తాము పార్టీ వ్యక్తులు అని, తమ గ్రామంలో ఏమైనా సమస్యలుంటే గ్రామస్థులతో కలిసి వచ్చినప్పుడు తమకు పార్టీ వ్యక్తిగా గౌరవం ఇవ్వకపోతే ఎలా అంటూ నిత్యం గొడవలే గొడవలే జరుగుతున్నా ఫలితం లేక కార్యకర్తలు తమ టైం వస్తుందని ఆలోచన ఉండగా, ఇటీవల ఓ గ్రామానికి చెందిన సర్పంచ్ కేంద్ర మంత్రిని కలిసేందుకు వెల్లినప్పుడు ఆయనకు చేదు అనుభవం ఎదురైందని టీడీపీ నాయకులు చెబుతున్నారు. కోపంతో ఆ రోజు కేంద్ర మంత్రిని కలవనీయకపోవడంతో తమ సత్తా ఏంటో చూపిస్తానంటూ ఎన్నాళ్లు ఈ పదవులు ఉంటాయి మళ్లీ ప్రజలకు వద్ద ఓటు కోసం రావాల్సిందేనంటూ ఆవేదన వ్యక్తం చేయగా, తరువాత కేంద్ర మంత్రి ఓ కార్యక్రమంలో భాగంగా ఆ సర్పంచ్‌ను కలిసి సర్ది చెప్పినట్లు తెలుస్తొంది.

ఏది ఏమైదినప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కావాల్సిన కార్యకర్తలు అధికారంలోకి వచ్చాక నాయకుడికి దూరం చేయడంపై చిటపట చిటపటలాడుతున్నారు.

రానున్న ఎన్నికల్లో కార్యకర్తలే వారికి సరైన రీతిలో వైద్యం చేస్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇస్కఫ్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతరం శ్రీకాకుళం**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం 'ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్' (ఇస్కఫ్) 2026 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తో కలిసి ఈ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్.వి.లక్ష్మణమూర్తి, ఆర్డీవో కె.సాయిప్రత్యూషతో పాటు డీఎస్పీలు సి.హెచ్.వివేకానంద, డి.లక్ష్మణరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ డి.మధుసూదనరావు, ఇస్కఫ్ రాష్ట్ర సభ్యులు ఎం.వి.మల్లేశ్వరరావు, జిల్లా ప్రతినిధులు సీపాన రామారావు, నాగభూషణరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# బాల్యం నుండే పోటీతత్వం అలవర్చుకోవాలి...!!

**నవతరం శ్రీకాకుళం**



నేడు గణిత శాస్ర వేత్త శ్రీ శ్రీనివాస్ రామానుజన్ గారి జయంతి సందర్భంగా బ్రాహ్మణతర్ల మోడల్ ప్రైమరీ స్కూల్ లో క్లస్టర్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది సందర్భంగా. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు గారు మరియు జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావితరాలకు భవిష్యత్ అని అన్నారు.

బాల్యం నుండి చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా విద్యార్థి దశ నుండే సమాయత్తం అవ్వాలి అని దృడ సంకల్పంతో ముందుకు వెళ్లాలని అన్నారు. మారుమూల వెనుకబడిన తరగతులలో ఆణిముత్యాలు లాంటి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి గొప్ప సంకల్పంతో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.మాష్టార్లు వద్ద నుండి మేము నేర్చుకున్న, మీరు నేర్పించినవే సందర్భం వచ్చినప్పుడు మేము చెబుతున్నాం.

ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం వల్ల పాఠశాలలో విద్యా ప్రమాణాలు చాలావరకు తగ్గినందుకు ఇలాంటి పరిస్థితులలో మంత్రివర్యులు నారా లోకేష్ గారు పట్టుబట్టి ఈ విద్యా శాఖను తీసుకోవడం జరిగింది.

ఒక సమూలమైన సంస్కరణలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థను ప్రతి సామాన్యుడికి చివరివరకు తీసుకువెళ్లాలని, పిల్లలను ఒక నాణ్యతాపరమైన విలువలతో కూడినటువంటి విద్యార్థులుగా తీర్చిదిద్దాలని మంచి తలంపుతో ముందుకు వెళుతున్నారు, కార్యక్రమంలో వీరితో పాటు తెలుగుదేశం నాయకులు దువ్వాడ శ్రీహర్ష నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ మోహనరావు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు వడ్డి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

# నేటి గ్లోబల్ గుర్తింపుకి భీజం వేసింది వాజ్ పేయ్

- భీమవరంలో జరిగిన విగ్రహావిష్కరణలో పాల్గొన్న రామ్మోహన్ నాయుడు
- అశేష జనసందోహం మధ్య ఘనంగా సాగిన రోడ్ షో..
- వాజ్ పేయ్ గురించి స్ఫూర్తిని కలిగించారంటూ ప్రసంగానికి కితాబు
- వాజ్ పేయ్ కవితలను హిందిలో చదివిన రామ్మోహన్ నాయుడు.
- వాజ్ పేయ్ లక్ష్యం మోదీతోనే సాధ్యం
- తన తండ్రి ఎర్రంనాయుడుతో వాజ్ పేయ్ మంచి సత్సంబంధాలు
- కోటి ఫేక్ సంతకాలు వారివైతే.. వేల కోట్ల మంది ఆప్యాయతలు మావి



**నవతరం-భీమవరం**



పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. తొలుత జరిగిన రోడ్ షో కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, రాధాకృష్ణ, అంజిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం వాజ్ పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరించి.. ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని -మిగతా 2లో

# క్రమశిక్షణ, శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యానికి ప్రాధాన్యం

- నిబద్ధతతో శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్
- జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఎస్‌సీటీపీసీ కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభం




**నవతరం శ్రీకాకుళం**

పోలీసు కానిస్టేబుల్ శిక్షణ సమయంలో క్రమశిక్షణ, నిబద్ధత, శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యం, ప్రజల పట్ల సేవాభావమే అత్యంత ముఖ్యమని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారు పేర్కొన్నారు.సోమవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (తండే వలస)లో నూతనంగా పోలీస్ కానిస్టేబుల్లుగా ఎంపికైన స్టైపెండియరీ క్యాడెట్ ట్రెయినీ పోలీస్ కానిస్టేబుల్స్ (ఎస్‌సీటీపీసీ)గా రాజమండ్రి,కృష్ణా జిల్లాలకు చెందిన 145 మంది అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి, చివరగా శాంతికి ప్రతీకగా పావురాలను నింగిలోకి విడిచిపెట్టారు. -మిగతా 3లో

ఎడిటోరియల్

# వెనిజులాపై సరికొత్త దాడి!

ఏ క్షణమైనా వెనిజులాపై దాడి చేసేందుకు అసాధారణ రీతిలో త్రివిధ దళాలను మోహరించిన అమెరికా వ్యూహాన్ని మార్చుకున్నదా? వ్యవధి తీసుకుంటున్నదా? క్యూబాపై గత కొద్ది దశాబ్దాలుగా ఆర్థికంగా దిగ్బంధనం కావించి లొంగదీసుకొనేందుకు చూస్తున్నారు. ఇప్పుడు వెనిజులా మీద కూడా అలాంటిదాడికే సిద్ధమౌతున్నదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అక్కడి నుంచి వచ్చే, వెళ్లే చమురు టాంకర్ల దిగ్బంధనంతో ఆయువుపట్టుగా ఉన్న చమురు ఎగుమతులను అడ్డుకుంటే వెనిజునియన్లు మదురో ప్రభుత్వానికి దూరమౌతారని ట్రంప్ సర్కార్ భావిస్తున్నది. ఆ మేరకు చమురు టాంకర్ల దిగ్బంధనాన్ని మంగళవారం నుంచి అమల్లోకి తెచ్చాడు.వెనిజులా సముద్రతీరాన్ని అమెరికా చుట్టుముట్టడం యుద్ధంతో సమానమే. దీని అర్థం మిలిటరీ భౌతికదాడి ప్రమాదం తప్పిందని అనుకొనేందుకు లేదు. దక్షిణ అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ అమెరికా ఖండంలో నౌకా దళాన్ని దింపినట్లు స్వయంగా ట్రంప్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నాడు. వాటిలో విమానవాహక యుద్ధనౌకతో సహా పదకొండు అధునాతన యుద్ధనావలున్నాయి.' వాణిజ్యం కొనసాగుతుంది, చమురు, ఇతర సహజ సంపదలన్నీ మావే, మా సంపద, మా భూమి, మా చమురుకు చట్టబద్ధమైన యజమానులం మేమే' అని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో మరోసారి బుధవారం నాడు స్పష్టం చేశాడు. అమెరికా గత కొద్ది నెలలుగా ప్రచారదాడి సాగిస్తున్నది. వెనిజులా నుంచి ముప్పు ఉందంటే సాధారణ అమెరికన్లు నమ్మే స్థితి లేదు. మన దేశం రష్యా నుంచి చమురుకొనుగోలు చేసి పరోక్షంగా ఉక్రెయిన్‌పై దాడులకు ఊతమిస్తున్నదని ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే వెనిజులా అధ్యక్షుడు స్వయంగా మాదక ద్రవ్యాల మాఫియా నాయకుడని, వాటితో పాటు నేరగాండ్లను అమెరికాలోకి పంపుతున్నాడని, ఇతర దేశాల ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నాడని, చమురు సంపదలను కొల్లగొట్టి అమ్మకాలతో సొమ్ము చేసుకుంటున్న ఉగ్రవాది అని చిత్రిస్తున్నది. మాదక ద్రవ్యాల ఉగ్రవాదం మీద పోరాటం జరుపుతున్నట్లు నమ్మించేందుకు పూను కుంది. అమెరికా భూమి, చమురు, ఆస్తులన్నింటినీ గతంలో చోరీ చేశారని వాటిని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు పూనుకున్నట్లు చెప్పటం వాటిలో ఒకటి.

అవేమిటి అంటే 2007 వెనిజులాలో ఉన్న ప్రవేటు అమెరికన్ కంపెనీలను నాటి అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ జాతీయం చేయలేదా అంటున్నారు. ఇటీవలి కాలంలో ఇతర దేశాల మీద భౌతికంగా దాడులు జరపటానికి జంకుతున్న అమెరికా ఆంక్షలతో దాడి చేస్తున్నది. ఈ ఏడాది జనవరి నుంచి రష్యా చమురు రవాణా చేసే 183, ఇరాన్‌తో సంబంధం ఉన్న 170టాంకర్లపై గత కొద్ది వారాలుగా ఆంక్షలు విధించింది. ఆ ప్రభుత్వాలను ఏమీ చేయలేక ఇతర దేశాలకు చెందిన వాణిజ్య టాంకర్లను బెదిరించి చమురు రవాణాను అడ్డుకోవటం తప్ప మరేమీ కాదు. ఇప్పటివరకు వెనిజులా చమురు సరఫరా చేసే 30 టాంకర్లపై ఆంక్షలు, ఇప్పుడు దిగ్బంధనానికి పూనుకున్నారు. సెప్టెంబరు నుంచి విమానాలు, నౌకాదళంతో అనేక దాడులు చేసి వెనిజులా నుంచి వస్తున్న పడవలలో ప్రయాణిస్తున్న తొంభై ఐదు మందిని అమెరికా హత్య చేసింది, వారిని అమెరికాకు మాదకద్రవ్యాలను సరఫరా చేసే మాఫియా సభ్యులుగా చిత్రించింది. మదురో దిగిపోయేంతవరకు దాడులు ఇలాగే కొనసాగుతాయని అధ్యక్ష భవన సిబ్బంది ప్రధాన అధికారి సుశీ వైల్స్ చెప్పాడు.

వెనిజులాపై అమెరికా మిలిటరీ దాడి జరుపుతుందా? పరిణామాలు, పర్యవసానాలు ఎలా ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఛావెజ్ పురోగామి భావజాలం కలిగిన ఒక మిలిటరీ అధికారి.లాటిన్ అమెరికా దేశాలలో మిలిటరీ పచ్చిమితవాదులతో కూడినది, దానికి భిన్నంగా వెనిజులాలో అనేక మంది పురోగామివాదులు ఉండబట్టే ఛావెజ్ నిలదొక్కుకున్నాడు, తన హయాంలో, తరువాత కూడా రాజకీయంగా మిలిటరీలో రాజకీయ భావజాలాన్ని చొప్పించిన కారణంగా అమెరికన్లకు అంత సులభంగా లొంగిపోయే అవకాశం లేదని చెబుతున్నారు. దీనికి తోడు బ్రెజిల్, మెక్సికో, కొలంబియాల్లో వామపక్ష, పురోగామి శక్తులు అధికారంలో ఉన్నాయి. మొత్తం లాటిన్ అమెరికా జనాభాలో సగం ఈ మూడు దేశాల్లోనే ఉన్నాయి. అక్కడి ప్రభుత్వాలు వెనిజులాకు మద్దతిస్తున్నాయి. ఇలాంటి అనేక ప్రతికూల అంశాలు ఉన్న కారణంగా ప్రస్తుతం మంచి చెడ్డలను బేరీజు వేసుకుంటున్నదని చెప్పవచ్చు. ఈలోగా వెనిజులాను రెచ్చగొట్టేందుకు పూనుకుంది, సామ్రాజ్యవాదులు ఎప్పుడైనా దురాగతానికైనా పాల్పడవచ్చు!

# అత్యుత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక



**నవతరం - పొందూరు:**

స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో ఒకప్పటి స్థానిక జిల్లా పరిషత్ హయ్యర్ సెకండరీ ఉన్నత పాఠశాల (ప్రస్తుత ఉన్నత పాఠశాల)పన్నెండో తరగతి 1966-67 జట్టు(బ్యాచ్) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యుత్సాహంగా జరిగింది.58 ఏళ్ల సుదీర్ఘ కాలం తరువాత కుటుంబాలతో సహా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వీరంతా ఉద్యోగ లేదా ఆయా వృత్తుల నుంచి విరమించినవారే.సుమారు 75 ఏళ్ల వయసు వచ్చిన వారే.దీర్ఘ విరామం తర్వాత ఒకే గొడుగు కిందకు రావడంపై ఆనాటి మధురానుభూతులను నెమరువేసుకుంటూ కొన్ని గంటల పాటు మరో ప్రపంచం లో ఉర్రూతలూగారు.దివంగతులైన నాటి గురువులను స్మరించుకున్నారు.కొందరికి అనారోగ్య సమస్యలున్నా వాటిని మరచిపోయి హుషారుగా కనిపించారు.తమ మిత్రుల ఫోన్ నెంబర్లను తీసుకొని సెల్ లో సేవ్ చేసుకున్న దృశ్యాలు కనిపించాయి.

## డాక్టర్ నాగేశ్వరరావుకు సన్మానం

స్థానిక ప్రముఖ ఫిజీషయన్ డాక్టర్ ఎం.వి.నాగేశ్వరరావును పూర్వ విద్యార్థులు దుశ్శాలువ, పుష్పగుచ్చం, మెమెంటోను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు జీవితంలోని ఈ చరమ దశలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరమని హితవు పలికారు.ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమానికి వాండ్రంగి దామోదరరావు, అల్లంశెట్టి మణిభూషణరావు, వి.వి.గోవిందరావు, జి.వి.సాంబశివరావు ఆధ్వర్యం వహించారు.

# గణితాన్ని మరోస్థాయికి తీసుకెళ్లిన మేధావి శ్రీనివాస రామానుజన్

## డా. పైడి.సింధూర- రవీంద్రభారతి పాఠశాలలో గణిత వారోత్సవాలు

**నవతరం-శ్రీకాకుళం**

గణితాన్ని మరోస్థాయికి తీసుకెళ్లిన మేధావి శ్రీనివాస రామానుజన్ అని, డా. పైడి.సింధూర అన్నారు. స్థానిక మండలవీధి రవీంద్రభారతి పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.తిణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన గణిత వేడుకలలో ముఖ్య అతిధిగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డా. పైడి.సింధూర పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గణిత మేధస్సుతో ప్రపంచాన్ని ఆకట్టుకున్న శ్రీనివాస రామానుజన్ గణిత మేధస్సును, ఆయన జీవిత విషయాలను తెలుసుకోవాలని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని గణితంలో మెళుకువలతోపాటు, పాఠశాల ఉపాధ్యాయులు అందించిన సూచనలతో ముందుకు వెళ్లాలన్నారు. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని గుర్తుచేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.తిణేష్ మాట్లాడుతూ



ప్రపంచమంతా ఇప్పుడు వినియోగిస్తున్న 1 నుంచి 9 వరకు అంకెలతో పునాదులేసి ఆ తరువాత కొత్తగా సున్నా (0)ను సైతం కనుగొని గణిత ప్రపంచాన్ని ఒక మలుపు తిప్పారని, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్ అని, తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారన్నారు. అనంతరం గణిత వారోత్సవాలలో భాగముగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, పాఠశాల యాజమాన్యం అందించిన ప్రశంసాపత్రాలను, డా.పైడి.సింధూర చేతుల మీదుగా అందించి, విద్యార్థులందరికీ మిఠాయిలను పంచిపెట్టారు.ఈ గణిత వారోత్సవాలలో పాఠశాల డిఐ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టి.రామ్ గోపాల్, ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ, మార్కెటింగ్ ఛైర్పర్సన్ పొడుగు.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైకల్యం లేని భారత్‌ని సాధిద్దాం

## చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఏపీ సిఆర్పిఎఫ్) రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు




**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న చౌదరి సత్యనారాయణ కాలనీలో పల్స్ పోలియో కార్య క్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ సూర స్వర్ణకుమారి, ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ "నిండు ప్రాణానికి రెండు చుక్కలు" ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.అంజి బాబు, రాజారావు, అంగన్వాడీ కార్య కర్తలు కృష్ణ కుమారి,తదితరు లు పాల్గొన్నారు.

# ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ నూతన కమిటీ ఎన్నిక

- జిల్లా చెర్మన్‌గా డోల తిరుమలరావు
- కార్యదర్శిగా ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు

**నవతరం -శ్రీకాకుళం**

జాతీయ స్థాయి సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ శ్రీకాకుళం చాప్టర్ నూతన చెర్మన్‌గా వాటర్ రిసోర్స్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ డోల తిరుమలరావు, కార్యదర్శిగా ఐతం కళాశాల ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. పట్టణంలోని హోటల్ గ్రాండ్‌లో ప్రస్తుత చెర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. నూతన కార్యవర్గ ఎన్నిక పరిశీలకులు ముని శ్రీనివాస్, చింతాడ రాజశేఖర్ పర్యవేక్షణలో నూతన కమిటీ 15 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో ఇంజనీర్లు పాత్ర ఎంతో కీలకమన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి అభినందనలు తెలిపారు. నూతన చెర్మన్ డోల తిరుమలరావు మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ శ్రీకాకుళం చాప్టర్ బలోపేతానికి



తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్ ప్రతినిధులు డాక్టర్ ఎస్.నాగరాజు, హారికాప్రసాద్, వి.పాపారావు, సి.హెచ్.రమేష్, బి.సంతోష్‌కుమార్, హెచ్.మన్మధరావు, కె.శ్రీనివాసరావు, డాక్టర్ సౌజన్యవాణి, డాక్టర్ బి.భూషణ్‌రత్, ఎల్.సాయి శంకర్ దీక్షిత్, ఎస్.రుషి, ఎస్.హరీష్‌కుమార్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి గ్లోబల్ గుర్తింపుకి భీజం వేసింది వాజ్ పేయ్

మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణాలకు ఉన్న ఆర్థిక, మౌలిక సదుపాయాల బలం భీమవరం కు ఉన్నా.. పల్లెల్లోని ఆప్యాయతలు ఇక్కడ అనంతమని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అలాంటి నేలలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం ఆనందకరమని, పదకొండు సంవత్సరాలుగా అనుకున్న భీమవరం పర్యటన ఈ రోజు సాకారమైందని తెలిపారు.అటల్ బిహారీ వాజ్‌పేయి, నా తండ్రి ఎర్రంనాయుడుల మధ్య ఎప్పటి నుండి మంచి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేస్తూ.. ఈ నెల 19వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన ఈ తరహా కార్యక్రమానికి పార్లమెంట్ కారణంగా హాజరు కాలేకపోయిన విషయాన్ని రామ్మోహన్ నాయుడు ప్రస్తావించారు. వాజ్‌పేయి గారి జీవిత చరిత్ర ప్రతి భారత పౌరుడికి పాఠ్యాంశమని, నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశానికి లభిస్తున్న గ్లోబల్ గుర్తింపుకు పునాది వేశిన దూరదృష్టి నాయకుడు వాజ్‌పేయి అని నివాళు లర్పించారు.వాజ్‌పేయి గారు దేశానికి మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రధానిగా చరిత్ర సృష్టించడంతో పాటు, 1999లో అన్ని వర్గాలను కలుపుకుంటూ రాజకీయాల్లో కొత్త విప్లవానికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. పదమూడు రోజులపాటు ప్రధానమంత్రిగా అవకాశం లభించినా, ప్రజాస్వామ్య విలువల కోసం పదవికి త్యాగం చేయడానికి కూడ వెనుకాడలేదని చెప్పారు. ఆయన నీతి, విలువలకు కట్టుబడి జరిపిన రాజకీయాలు నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.దేశ అభివృద్ధి వేగవంతం చేయడానికి వాజ్‌పేయి గారు స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్టు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి పథకాల ద్వారా గ్రామాలుపట్టణాల మధ్య అనుసంధానం పెంచారని, భారతదేశాన్ని అణు శక్తి దేశంగా నిలబెట్టే ధైర్య నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఉత్తరతూర్పు ప్రాంతానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి పనిచేసిన నాయకుడిగా వాజ్‌పేయి గారి సేవలను వివరించారు. వాజ్‌పేయిచంద్రబాబు మధ్య బంధం అన్నదమ్ముల మధ్య బంధంలా ఉండేదని, అదే అనుబంధం నేడు ప్రధాని నరేంద్ర మోదీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మధ్య కొనసాగుతోందని చెప్పారు. అనంతరం రాష్ట్ర బిజెపి నాయకత్వం నుండి ఉత్సవ జ్ఞాపికను రామ్మోహన్ నాయుడు అందుకున్నారు.

# అన్నదాతను ఆదుకుందాం


యం.రాం ప్రదీప్

(డిసెంబర్ 23 జాతీయ వ్యవసాయ దారుల దినోత్సవం)

దేశానికి వెన్నుముక రైతు. అటువంటి రైతుకుటుంబము నుండివచ్చి ప్రధాని పదవిని అలంకరించిన చరణ్ సింగ్ జయంతిని (డిసెంబర్ 23) జాతీయ వ్యవసాయదారుల దినోత్సవంగా(కిసాన్ దివస్) జరుపుకుంటోంది మనదేశం. ప్రజలందరి ఆకలి బాధను తొలగించే దైవాలు రైతులు.

నేలతల్లినినమ్ముకొని,పలురకాలప్రతికూల పరిస్థితులను తట్టుకుంటూ, శ్రమించి పంటలను పండించిదేశ ఆర్థికవ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తారు మన వ్యవసాయదారులు.ఒకప్పుడు అందరి వృత్తీ వ్యవసాయమే. కానీ, ఇప్పుడు పదిమందికీఅన్నం పెట్టే రైతన్నలు కరువైయ్యారు. దేశం ఎంత అభివృద్ధి చెందినారైతుల కష్టాలు మాత్రం తగ్గడం లేదు.

మనది ప్రాధమికంగా వ్యవసాయ దేశం. ఇందులో మహిళలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే రాను రాను వ్యవసాయానికి యువత దూరం అవుతున్నారు. ఫలితంగా వలసలు పెరుగుతున్నాయి.

వికసిత్ భారత్ 2047 – భారతీయ వ్యవసాయాన్ని ప్రపంచీకరించడంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల పాత్ర అనే థీమ్ తో ఈ ఏడాది రైతు దినోత్సవం జరుపుతున్నారు.

మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే జమీందారీ చట్టం రద్దు అయింది. కౌలుదారీ చట్టం వచ్చింది.రైతులను వడ్డీవ్యాపారుల కబంధహస్తాలనుండి విడిపించి వారికి బ్యాంకు ఋణాలు అందించే విధానము ప్రవేశ పెట్టేలా చేయడం వెనుక చరణ్ సింగ్ నిర్వహించిన రైతు ఉద్యమాలున్నాయి . రైతుల గురించి, వ్యవసాయం గురించి అంతగా ఆలోచించి , వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చరణ్ సింగ్ దేశ ప్రధాని అయినపుడు రైతాంగం ఆనంద పడింది . అయితే ఆయన పార్లమెంట్ ను ఎదుర్కోలేకపోయి తాత్కాలిక ప్రధానిగానే 1980 వ సంవత్సరము పదవి నుండి తప్పుకోవాల్సి వచ్చింది. చరణ్ సింగ్ రైతునాయకుడిగానే 1987 మే 29 న మరణించారు. రైతులకు ఆయనచేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వము చరణ్ సింగ్ జయంతిని కిసాన్ దివస్ గా ప్రకటించింది.

పంటలు పండించడానికి వారు పడే శ్రమకు గుర్తింపు లేక, చేసిన అప్పులు తీర్చలేక అత్మహత్యలు చేసుకుంటున్న రైతన్నను కాపాడేందుకు మనమందరం నడుం బిగించాలి.రైతులకు సీలింగ్ మరియు మిగులు భూములని పంపిణీ చేయడం, వ్యవసాయ భూములను, వేరే అవసరాలకు వినియోగించకుండా ఉండటం, పంటల బీమాను సమర్థవంతంగా అమలు చేయడం, పండిన పంటలకు మంచి మద్దతు ధర ఉండేట్లు చూడటం, రైతులకు వడ్డీ భారం తగ్గించడం వంటి స్వామి నాథన్ కమిషన్ సిఫార్సుల అమలుతోనే అన్నదాతలను ఆదుకోవడం సాధ్యం అవుతుంది.

## క్రమశిక్షణ, శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యానికి ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శిక్షణ సమయంలో చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని ట్రెయినీలకు సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ కాలాన్ని అత్యంత విలువైనదిగా భావించాలన్నారు. పోలీస్ ఉద్యోగం గౌరవప్రదమైన బాధ్యత అని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు.పోలీస్ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన సేవా వృత్తి అని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న ట్రెయినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, ధైర్యం వంటి లక్షణాలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు.ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణలో పోలీస్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, అందుకే ప్రతి పోలీస్ సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజల విశ్వాసమే పోలీస్ విభాగానికి మూలస్తంభమని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని స్పష్టం చేశారు.పోలీస్ ఉద్యోగం గౌరవప్రదమైనదే కాకుండా సవాళ్లతో కూడుకున్నదని, పని ఒత్తిడి మధ్యన కూడా చట్టబద్ధత, నైతిక విలువలు, మానవత్వాన్ని ఎప్పటికీ వదలకూడదని హితవు పలికారు. ప్రతి పోలీస్ సిబ్బంది ప్రజల దృష్టిలో నమ్మకమైన రక్షకుడిగా నిలవాలని, పోలీస్ యూనిఫాం గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని సూచించారు.అదనపు ఎస్పీ (ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్) శ్రీ కె.వి. రమణ మాట్లాడుతూ శిక్షణ సమయంలో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, చట్టాలపై అవగాహన, ప్రజల పట్ల సానుభూతి, వ్యక్తిగత అభివృద్ధి, యోగ, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి అత్యంత అవసరమని అన్నారు. సైబర్ నేరాలు ప్రస్తుత సమాజంలో పెద్ద సవాలుగా మారాయని, సాంకేతికతను అందిపుచ్చుకొని అందుకు తగిన శిక్షణ పొందాలని సూచించారు.క్రిమినల్ లా, ప్రత్యేక చట్టాలు, ఆయుధాల వినియోగం, డ్రిల్, పరేడ్, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన, విపత్తుల నిర్వహణ, ప్రజలతో మైత్రీ సంబంధాలు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించబడుతుందని తెలిపారు.

# అదిగో ఆకాశాన ఒక తార ఉదయించే..!

ఆ క్రిస్మస్ రాత్రి అంతా
కొత్త కలలతో నిండిపోయే
ఈ భువనమంతా
దివ్యగానాలతో మారుమ్రోగే

కుంటివారికి నడకనిచ్చి...
గుడ్డివారికి చూపునిచ్చి...
మూగవారికి మాటనిచ్చి...
రోగుల హృదయాలకు
ఆరోగ్యాన్ని ప్రసాదించే...
ఒక మహా వైద్యుడుదయించే

శాంతి సందేశాన్ని
శ్వాసగా ధరించిన
ఒక శాంతి స్వరూపుడు
ప్రేమకు ప్రతిరూపంగా
కరుణకు చిరునామాగా
ఒక
మహిమాన్వితుడవతరించే...

మనుష్య రూపాన నేడు
మరియ యోసేపు సుతునిగా
పరిశుద్ధాత్మ వరమున...
బెత్లహేము పురమున...
పశువుల పాకలో శిశువై
జన్మించే

నేనే పాపుల భారాన్ని మోసే
గొర్రెపిల్లనంటూ లోకరక్షకుడు
మంచి గొర్రెలకాపరిగా
ఉదయించే
దేవదూతల గానాల నడుమ
దర్శించిన
గొర్రెల కాపరుల జన్మ
ధన్యమాయే...

అదిగో ఆకాశాన ఓ నక్షత్రం
ఉదయించే...
అది ప్రపంచమంతా
ఆశాదీపమై ప్రకాశించే
అజ్ఞానాంధకారాన్ని చీల్చే
ఒక జ్ఞాన సూర్యుడు
ఉదయించే
దర్శించి ముగ్గురుజ్ఞానులు
మురిసిపోయే..

నేనే జీవము... నేనే
సత్యము....
నేనే మార్గమంటూ...
మానవాళికి దారిచూపే
దైవతార ఒకటి ఉదయించే
కోటానుకోట్ల హృదయాలు
పరవశించే...

జై "జీసస్ జై జీసస్"అంటూ
ఆనందతాండవం చేసే
ఆకాశంలో మెరిసే
నక్షత్రాలై...

ఉల్లాసంతో ఉత్సాహంతో
ఉప్పొంగిపోయే మనసులతో
ఉయ్యాల
జంపాల
లూగుతూ
సంతోష
సాగరంలో
మునిగితేలే
పాపపు
నరకకూపంలో
అల్లాడుతున్న
నరుల కోసం
పుడమిపై పుట్టే
ఓ పుణ్య
పురుషుడై
మరణపు
ముల్లును విరిచే
మృత్యుంజయుడై
ముందే ఉదయించే...
కాలానికి అతీతుడై
కాలగర్భంలో అడుగుపెట్టి
కాంతినిపంచే...

ఆ ప్రభువు పరిశుద్ధ నామాన్ని
నిత్యం స్మరించిన...భక్తితో
ప్రార్థించిన...
ఆకలిదప్పులు...మరణ
భయంలేని...
జీవజలాలుప్పొంగే పరలోక
రాజ్యప్రాప్తికై
ప్రభువు పరీక్షించిన...ఆశతో
నిరీక్షించిన...
వారి జన్మ ధన్యం...వారికి
దక్కు పుణ్యం..!

ఆర్యా ఇది నా స్వీయ రచన
దేనికి అనువాదం అనుకరణ
కాదు ఇది నా హామీ
పోలయ్య కవి



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# హీరోల వయసుతో నాకు సంబంధం లేదు

తనకు హీరోల వయసుతో సంబంధం లేదంటోంది హీరోయిన్ అషికా రంగనాథ్. తను కేవలం సినిమాలో తన పాత్ర మాత్రమే చూస్తానని, క్యారెక్టర్ నచ్చితే, హీరో వయసును పట్టించుకోనని తెలిపింది. "ఓ నటిగా తెరపై నా పాత్ర ఎంత బాగుందనేది మాత్రమే నేను చూస్తాను. నిజానికి అంత పెద్ద నటులతో కలిసి పనిచేస్తే వాళ్ల అనుభవం నుంచి మరిన్ని నేర్చుకోవచ్చు. కాబట్టి వయసు అనేది ప్రామాణికం కాదు. యంగ్ హీరో అయినా, సీనియర్ హీరో అయినా మన పాత్ర బాగుందా లేదా అనేది చూసుకుంటాను." ఉన్నఫలంగా ఈ బ్యూటీ ఈ స్టేట్ మెంట్ ఇవ్వడానికి ఓ కారణం ఉంది. రవితేజ లాంటి సీనియర్ హీరో సరసన సినిమా చేసింది అషికా. అదే భర్త మహాశయులకు విజ్ఞప్తి. రవితేజతో తనకున్న వయసు తేడా గురించి మీడియా అడిగిన ప్రశ్నకు పై విధంగా సమాధానం చెప్పింది. నిజానికి ఈ విషయంలో అషికా ఎప్పుడో హద్దులు చెరిపేసింది. నాగార్జున సరసన నటించింది. విశ్వంభరలో చిరంజీవి సరసన కూడా నటించింది. అలా చేసినప్పటికీ తన పాత్రల్లో యంగ్ నెస్ ఉందని చెబుతోంది. నా సామిరంగాలో యంగ్ రోల్ చేశానని, రవితేజతో చేసిన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాలో కూడా తనది మోడ్రన్ అమ్మాయి పాత్ర అని చెబుతోంది 29 ఏళ్ల అషిక.



# ఇకపై వరుసగా ప్రచార కార్యక్రమాలు

సంక్రాంతి సినిమాలతో పాటు మరో పెద్ద సినిమా ప్రచారం కూడా మొదలైంది. అదే టాక్సిక్. యష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా నుంచి హీరోయిన్ కియరా అద్వానీ లుక్ విడుదల చేశారు. నదియా పాత్రలో కియరా స్టయిలిష్‌గా కనిపిస్తూనే, ఎంతో బాధ, బరువును మోస్తున్నట్టు ఆమె లుక్‌ను డిజైన్ చేశారు. ఈమె లుక్ సంగతి పక్కనపెడితే, టాక్సిక్ ప్రచారాన్ని ఇకపై మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లబోతోంది యూనిట్. సమ్మర్‌లో రిలీజ్ పెట్టుకున్నప్పటికీ, ఇప్పట్నుంచే ప్రచారాన్ని కొనసాగించాలని భావిస్తోంది. ఈ మేరకు రూట్‌మ్యాప్ కూడా సిద్ధమైంది.



ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు యష్. కేజీఎఫ్ ఫ్రాంచైజీ తర్వాత లాంగ్ గ్యాప్ తీసుకొని యష్ చేస్తున్న సినిమా ఇది. కేజీఎఫ్‌తో వచ్చిన పాన్ ఇండియా అప్పీల్‌ను నిలబెట్టుకోవడంతో పాటు, తన మార్కెట్‌ను మరింత పెంచుకోవడం యష్‌కు ఇప్పుడు చాలా ముఖ్యం. అందుకే టాక్సిక్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. ఓవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ తో పాటు, దేశవ్యాప్తంగా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించాడు.

యాక్షన్ జానర్‌లో డిఫరెంట్ కాన్సెప్ట్ తో గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది టాక్సిక్ మూవీ. సినిమాలో నటించిన ఇతర హీరోయిన్ల ఫస్ట్ లుక్స్‌ను వచ్చే నెలలో విడుదల చేయబోతున్నారు. మార్చి 19న ఈ సినిమా థియేటర్లలోకి వస్తోంది.

# ప్రజాసేవకే నా జీవితం అంకితం

**నవతరం-అరకు**



అరకు పార్లమెంట్ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు మోజూరు తేజావతి అరకు పార్లమెంట్ అధ్యక్షురాలిగా నన్ను నియమించినందుకు తెలుగుదేశం పార్టీ అధినాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మోజూరు తేజావతి తెలిపారు.జ్ఞానాన్ని బోధించే ఉపాధ్యాయ వృత్తి నుండి, సమాజ దిశను మార్చే ప్రజా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాకు, తెలుగుదేశం పార్టీ ఈరోజు ఒక గొప్ప బాధ్యతను అప్పగించిందన్నారు. నాపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస్ గారికి, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారికి, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ అచ్చం నాయుడు గారితో పాటు ఇతర ముఖ్య నేతలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన తాను, ఇప్పుడు సమాజంలోని ప్రతి పౌరుడి భవిష్యత్తు కోసం, ముఖ్యంగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి నేర్పిన క్రమశిక్షణ, నిబద్ధతలను రాజకీయ జీవితంలోనూ పాటిస్తానని స్పష్టం చేశారు.తనకు అండగా నిలుస్తున్న పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక వందనాలు తెలియజేస్తూ, నన్ను తమలో ఒకరిగా స్వీకరించి, మద్దతుగా నిలుస్తున్న తెలుగు తమ్ముళ్ల సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు.ప్రజల సమస్యలే తన అజెండా అని, సామాన్యుడి గొంతుకగా పార్లమెంట్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యతను పూర్తి అంకితభావంతో నిర్వర్తిస్తానన్నారు.గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ, రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు.ఈ సందర్భంగా అనకాపల్లి పర్యటనకు వచ్చిన పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని కలిసి, పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను అత్యంత విశ్వసనీయంగా, నిబద్ధతతో నిర్వర్తిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వ్యక్తిగత స్వార్థం లేకుండా వ్యవస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తూ, పార్టీ నాయకత్వానికి మరియు ప్రజలకు జవాబుదారీగా ఉంటానని మోజూరు తేజావతి ఈ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# నూతన జిల్లా అధ్యక్షుడుతో పార్టీ మరింత బలోపేతం

**నవతరం-ఆమదాలవలస**

నూతనంగా నియమించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్ సారధ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎష సెల్ ప్రధాన కార్యదర్శి సవలపురపు వెంకటరమణ మాదిగ, అన్నారుఈ మేరకు సోమవారం ఆమదాలవలసలోని ఆయన స్వగృహంలో చిట్టి నాగభూషణం, చిట్టి సాయి కిరణ్, కోర్లకోట కొండలరావు కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు.

రమేష్ ఆధ్వర్యంలో రాబోయే స్థానిక ఎన్నికల లోనూ, 2029 జాతీయ సర్వాత్రిక ఎన్నికల లో కూటమి పార్టీ లు విజయం సాదించగలవు అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# సంతల బైలులో ఘనంగా క్రిస్మస్

## వంద మంది దైవ సేవకులకు సన్మానం
## 28 వస్తువులు అందజేసిన తమ్మినేని రవి బాబు



**నవతరం-జలుమూరు**



జలుమూరు మండలం సంతలబైలు గ్రామంలో నిజ స్నేహితుడు మందిరంలో రెవ. డా, తమ్మినేని రవిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో 100 మంది దైవ సేవకులకు సన్మానము చేశారు. ప్రతి దైవ సేవకుల కుటుంబాలకు 28 వస్తువులను అందజేశారు. కార్యక్రమమునకు జిల్లా నలు మూలల నుండి 400 మంది దైవ సేవకుల కుటుంబాలు హాజరైయ్యా రు. ఈ క్రిస్మస్ వేడుకలో రెవ. డాక్టర్ తమ్మినేని రవిబాబు క్రిస్మస్ వర్తమానం అందించారు.

రామయ్య చేతుల మీదుగా క్రిస్మస్ కేక్ కట్ చేయించారు. హెచ్. రాజారావు, రఘురాం, హెచ్. అఖిల, సి.హెచ్. జయమ్మ, వి.రామరాజు, టి.లత తో పాటు సంతులబైలు, సొడాం, సీతారాంపురం సంఘాలు నుండి ప్రజలు పెద్ద ఎత్తున క్రిస్మస్ లో పాల్గొన్నారు.

# ఐతం కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం

డైరెక్టర్ ప్రొ. వి.వి. నాగేశ్వరరావు





**నవతరం టెక్కలి**

గణిత శాస్త్రము,సాంకేతిక ఇంజనీరింగ్, డేటాసైన్స్‌కు మూలాధారం. - ఐతం కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం టెక్కలి సమీపంలోని స్థానిక ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో భారతీయ మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించు కున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడంతో పాటు పరిశోధనా దృక్పథాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్ నాగేశ్వరావు మాట్లాడుతూ గణితం విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఇంజినీరింగ్, డేటా సైన్స్, కృత్రిమ మేధ వంటి ఆధునిక రంగాలకు మూలాధారమని తెలిపారు. విద్యార్థుల తార్కిక ఆలోచనాశక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో గణితానికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. శ్రీనివాస రామానుజన్ గణిత రంగానికి అందించిన పరిశోధనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, సాధారణ కుటుంబ నేపథ్యంతో ప్రారంభమైన రామానుజన్ జీవితం అసాధారణ ప్రతిభకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ఎదురైన కష్టాలను తట్టుకొని గణితంపై అపారమైన ప్రేమతో ప్రపంచ గుర్తింపు సాధించిన ఆయన జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు గణితాన్ని కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన నైపుణ్యంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. రత్నమణి, , డా. రమణయ్య, డా శాంతికుమార్, మరియు గణిత అధ్యాపకులు గణిత ప్రాముఖ్యత, ఆధునిక సాంకేతిక రంగాల్లో గణిత వినియోగం, పరిశోధన అవకాశాలపై ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన ఉపన్యాసాలు, చర్చా కార్యక్రమాలు విద్యార్థుల్లో మంచి స్పందన పొందాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# గ్రీవెన్స్ సక్రమంగా అమలు కావడం లేదు

**నవతరం-మందస**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమం మందస మండలంలో సక్రమంగా జరగడం లేదు ప్రజాసమస్యలు ఆయా శాఖలకు సంబంధించి పరిష్కారం కావడం లేదని ప్రజలు అంటున్నారు ఇక్కడ గ్రీవెన్స్ సక్రమంగా అమలు కాని పరిస్థితులు నెలకొనడం పట్ల చర్చనీయాం సమవుతుంది ప్రభుత్వ పాలన నీరుగారిపోతుంది మందస తాసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్కు పలు శాఖల అధికారులు పూర్తిగా రావడం లేదు నెలలు తరబడి గ్రీవెన్స్కు హాజరుకాని పలు శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజుల కిందట సమాధానాలు కోరుతూ స్థానిక తాసిల్దార్ కార్యాలయం నుంచి లేఖలు పంపారు ఈ లేఖలకు గ్రీవెన్స్ కు హాజరు కాని అధికారులు సమాధానాలు రాతపూర్వకంగా అందెవ్వలేదు సరి కదా ఈరోజు సోమవారం జరిగిన గ్రీవెన్స్ కు కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్కు కూడా హాజరు కాలేదు దీంతో కలెక్టర్ ఆదేశాలు కూడా ఈ మండలంలోని అధికారులు పట్టించుకోవడం లేదనేది గ్రీవెన్స్ కార్యక్రమమే ఉదాహరణగా చెప్పుకోవచ్చునని ప్రజలు అంటున్నారు కాగా సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో తాసిల్దార్ మిస్కా శ్రీకాంత్ రైతుల నుంచి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై వెంకటరమణ వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు వెలుగు ఏపిఎం పైడి కూర్మారావు అంగన్వాడి సూపర్వైజర్ రామలక్ష్మి పాల్గొన్నారు మిగతా శాఖల కు చెందిన అధికారులు ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరు కాలేదు గ్రీవెన్స్ కార్యక్రమానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో గ్రీవెన్స్ కార్యక్రమం నీరు గారిపోతుంది.

# శ్రీకాకుళంలో మలబార్ బ్రైడ్స్ ఉత్సవం

**నవతరం శ్రీకాకుళం**

**- భారతీయ వివాహ వైభవానికి ప్రతీకగా ప్రత్యేక ప్రచారం**

**- వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యతకు మలబార్ ప్రాధాన్యం**

**- లాభాల్లో 5 శాతం సేవా కార్యక్రమాలకే వినియోగం**

శ్రీకాకుళంలో భారతీయ వివాహ సంప్రదాయాల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 15వ ఎడిషన్ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతున్న ఈ ప్రచారం, సంప్రదాయం ఆధునికత సమ్మేళనంగా వధూభూషణల ప్రత్యేకతను ప్రతిఫలింపజేస్తోంది. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ ప్రతినిధులు మాట్లాడుతూ, సంస్థ వ్యాపార విజయాలతో పాటు సామాజిక బాధ్యతను సమానంగా కొనసాగిస్తోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, ఆకలి లేని సమాజం, మహిళా సాధికారత వంటి కీలక రంగాల్లో మలబార్ గ్రూప్ విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అలాగే ఈ.ఎస్.జి (పర్యావరణ-సామాజిక-పాలన) సూత్రాలను తమ వ్యాపార విధానాల్లో భాగంగా అమలు చేస్తూ, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందన్నారు. మలబార్ గ్రూప్ తమ లాభాల్లో 5 శాతం మొత్తాన్ని ఆయా దేశాల్లో సామాజిక సేవా కార్యక్రమాలకు




వినియోగించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన వ్యాపారం, సమాజాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మలబార్ గ్రూప్, సామాజిక స్పృహ కలిగిన సంస్థగా తన ప్రత్యేక గుర్తింపును మరింత బలపరుస్తోందని వారు స్పష్టం చేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**